
# సౌందర్య సాక్షాత్కారం

- కప్పగంతుల మల్లికార్జునరావు



రాజగోపాలరావు చిన్నప్పటినుంచి ఉండేవాడు. బట్ట నలగనివ్వడు. ఎప్పుడూ కడిగిన ముత్యంలా క్రాపు చెదరనివ్వడు. పెద్ద అంద



గాడు కాకపోయినా పైపై అలంకరణలవల్ల అందగాడుగానే పరిగణింపబడుతూ వచ్చాడు.

“నలకూబరుడి తమ్ముడు నా కొడుకు. వాడికి ఎంత సౌందర్య దృష్టో! వాడికి ధీటైన పెళ్ళాన్ని వాడు ఎన్నుకోవాల్సిందే!” అని అతని తల్లి పొంగిపోతుండేది.

రాజగోపాలరావుకు భౌతిక సౌందర్యంపట్ల మక్కువ తప్ప, మానసిక సౌందర్యం బొత్తిగా లేదు. అతని మనస్సు కోతి. బుద్ధి వక్రం!

డిగ్రీ కాగానే చదువులవల్ల లాభం లేదని తెల్సుకొని తండ్రి చేస్తున్న చిన్న వ్యాపారంలోకి దిగేడు. ఎన్నిమార్గాలు తొక్కాలో అన్ని మార్గాలు తొక్కి, చాకచక్యంతో వ్యాపారాన్ని పెంచి పెద్ద చేసేడు. చెప్పుకోదగ్గ ధనవంతుల లిస్టులోకి త్వరలోనే చేరిపోయాడు.

“మావాడు ప్రేక్టికల్ మనిషండీ. వాడివల్లే మా వ్యాపారం మూడు పువ్వులు పదహారు కాయలయింది. ఒకనాటికి ఏ బిర్లానో, టాటానో అవుతాడు చూడండి!” అని తండ్రి అందరి దగ్గరా కొడుకును గురించి గొప్పలు చెప్పేవాడు.

నిజానికి రాజగోపాలరావుకు పెద్ద పారిశ్రామికవేత్త కావాలన్న కోరిక వుంది. అందుకు తగ్గ అర్థబలం వుంది. మేధాసంపత్తి వుంది. అంగబలం - మరో ఇండస్ట్రియలిస్టు అండ కూడా వుంటే!

అందుగ్గాను ఆలోచించి ఆలో

చించి అరవిందను నెమ్మదిగా మాటల్తో ఆకర్షించి పెళ్ళిచేసు కొన్నాడు.

అరవింద ఆ జిల్లాలో పేరు పొందిన ఇ దస్ట్రియలిస్టు కూతురు. బాహ్య సౌందర్యం, మానసిక సౌందర్యం రెండూ కలిగినటు వంటిది. మన స్తశ్వ శాస్త్రం ఆమె అభిమాన విషయం. రాజగోపాల రావు మాటలకు, అంతకన్నా మించి అతని సౌందర్య దృష్టి చూచి మురిసిపోయి పెళ్ళిచేసుకొంది.

అంతా రాజగోపాలరావునే 'అదృష్టవంతు'డన్నారు. విని విని విసుగేసి, "ఏం అరవింద అదృష్టం అని ఎందుకనుకోరు?" అన్నాడు.

"నాయనా రాజూ! నువ్వు వో యింటివాడివయ్యాక ప్రయోజకుడి వనిపించుకొన్నావ్. నీ చెల్లెలి పెళ్ళి చేసే బాధ్యత నీదే" అన్నారు తల్లి దండ్రులు.

మాధురి ప్రబంధ నాయికలాగుం టుంది. అన్న చాటున చెల్లెలై, తెలుగు సాహిత్యం చదువుకుంటూ పెరిగిందేమో- వూహా ప్రపంచం. ప్రబంధ లోకం తప్ప, వాస్తవ జీవితంలో చేదులు ఆమెకు బొత్తిగా తెలియవు.

చెల్లెలు పెళ్ళిని గురించి తల్లి దండ్రులకు అభయమిచ్చి, తీవ్రంగా ఆలోచించాడు రాజగోపాలరావు.

మాధురి అరవింద కన్నా అంద గత్తె. అరవింద ఇండస్ట్రియలిస్టు కూతురవుతే మాధురి ప్రముఖ వ్యాపారస్తుడి చెల్లెలు.

'తనేం చేసేడు? బిజినెస్ పెంపు దల కోసం అరవిందను అనేక మార్గాల్లో ఆకర్షించి పెళ్ళి చేసు కొన్నాడు. ఆమెతో పెళ్ళి అప్పుడే వ్యాపార ఫలాలనిస్తున్నది. తనలాగే బిజినెస్ దృష్టితో మరోచిన్న వ్యాపారో, వుద్యోగో మాధురిని ఆకర్షిస్తే? తను మామగారిని వుప యోగించుకొంటున్నట్లు, తనను వుపయోగించుకోటానికి ప్రయత్నిస్తే? అమ్మో!'

అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకొన్నాడు. పైగా మాధురి వివాహాన్ని తన వ్యాపార విస్తర ణకు ఆయుధంగా వాడుకొనే అవ కాశాల కోసం అన్వేషించాడు. రామానుజంతో ఆమె వివాహాన్ని నిర్ణయించేడు.

తండ్రి తెలివితేటల్తో వృద్ధిచేసిన వ్యాపార సామ్రాజ్యాన్ని ఏణ్ణర్థం తిరగకముందే సగానికి సగం కరి గించేసిన ప్రబుద్ధుడు రామానుజం. కేవలం కొత్త సుఖాల కోసం సినిమా తీసేడు. సకల గుణాభిరాముడు.

"ఆ 'సింకింగ్ షిప్'కా మాధురిని కట్టబెట్టారు?" భర్త తత్వాన్ని అర్థం చేసుకుంటున్న అరవింద అంది భర్తతో.

"సింకింగ్‌షిప్! వాట్ డు యు మీన్?"

"అర్థ తాత్పర్యాలు మీకు తెలియనా? మీకు తెలీని సంగతి చెప్తాను వినండి. రామానుజం తన బిజినెస్సంతా నా పేర రాసిస్తానన్నా నేనా అతనితో నా పెళ్ళిని అంగీకరించలేదు."

"ఐసీ! కాని అవతల అతనికి మాట యిచ్చానే. పోనీ మాధురిని అడిగి చూద్దామా? ఆమె కావంటే పెళ్ళి కేన్సిల్ చేస్తాను."

మాధురికి బిజినెస్ రహస్యాలేం తెల్సు?

"మా అన్నయ్య దేముడిలాంటి వాడు వదినా! ప్రాక్టికల్ మనిషి. సౌందర్య దృష్టివున్నవాడు. ఆలోచించకుండా చేస్తాడా నా పెళ్ళి? అతడి యిష్టాన్ని విర్ణయాన్ని నేను కాదనను."

భార్యమీద వో గొప్ప మానసిక విజయాన్ని సాధించినట్లు గర్వించాడు రాజగోపాలరావు.

* * *

రామ్‌నంద్ రెండు బస్తీల మధ్యగల అడవికి రాజులాంటి వాడు. చేసేవృత్తి దొంగతనమైనా, సంపాదించింది కేవలం తనకోసమే కాకుండా ఆ ప్రాంత ప్రజల క్షేమం కోసం కూడా ఖర్చుపెడ్తాడు కనుక, ప్రజల్లో అతనికి మంచి పలుకుబడి వుంది

అతని గత చరిత్ర ఎవరికీ తెలియదు. కానీ ఎంత దొంగయినా సంస్కారవంతుడిలా కన్పిస్తాడు. అతను తాగుతాడు-తింటాడు. కానీ స్త్రీల జోలికిపోడు కాగా వారిపట్ల విముఖత్వాన్ని ప్రదర్శిస్తుంటాడు.

అలాంటిది ఆరోజు అతనికి స్త్రీని అనుభవించాలన్న కోరిక కలిగింది. తల్చుకొంటే డబ్బిచ్చి కొనుక్కోటానికి స్త్రీలకి కొరతలేదు. కానీ అతనికి అతి సౌందర్యవతి అయిన స్త్రీని అనుభవించాలన్న కోరిక కలిగింది. అకస్మాత్తుగా రాత్రి పదకొండు గంటలప్పుడు అందమైన స్త్రీలు ఎక్కడ లభ్యమవుతారు?

అనుచరులను కేక లేసేడు. "జాతీయ రహదారిని కాసి, కార్లను ఆపి, అందులో అందమైన స్త్రీ కనిపిస్తే, తీసుకురండి" అని ఆజ్ఞాపించాడు.

అనుచరులు ఆశ్చర్యపోయారు! ఆకాశంలోని కార్తీక పౌర్ణమి

చంద్రుడు ముసి ముసి నవ్వులు నవ్వేడు!

* * *

పాతికమైళ్ళ దూరంలో వున్న పొరుగుబస్తీలో అంతర్జాతీయ ప్రఖ్యాతి గడించిన మన స్త్రీశాస్త్ర వేత్త వుపన్యాసం వుందని బయలు దేరతీసింది అరవింద. రాజగోపాల రావు మొదట్లో వెళ్ళటానికి సుము ఖత్వం చూపలేదు. అసలే ఈమధ్య ఆరహదారిలో దారి దోపిడీలు ఎక్కు వయ్యాయి.

కానీ అరవింద పట్టుపట్టడంతో, తనకు వుపయోగించే 'ఇండస్ట్రి యల్ సైకాలజీ'ని గురించి వో ముక్క ఏమన్నా చెప్తాడేమోనన్న ఆశతో బయలుదేరేడు.

తీరా ఆ వుపన్యాసం ఎవరికీ నచ్చలేదు హేతువాదినంటూ, ఆ శాస్త్రవేత్త పాతబడ్డ విషయాలను పునశ్చరణ చేసేడు.

"అంత పెద్ద సైకాలజిస్టు అన్నావుగదా వదినా! హిందూ జీవన విధానంలో 'దేముడు' అన్న పదం వో మానసిక భావనకు ప్రతీక అన్న ప్రాథమిక సత్యం తెలియదా అత నికి? దేముడు అన్న పదానికీ, మూఢనమ్మకాలకి, బాబాలు చేసే మాయలకి ముడి పెడ్తాడేం?" మాధురి అంది కారులో.

"మతాన్ని అడ్డంపెట్టుకొని కొందరు బాబాలు మాయలుచేసి జనాన్ని ఆకర్షిస్తున్నారు. యీ పరీశ్వరబాబాగారు సైకాలజీని అడ్డం పెట్టుకొని- మాయలు, మోసాలు చేస్తున్నాడు మనీ ప్లస్ యిగో మని షిని నడిపిస్తున్నాయి."

కారు డ్రైవ్‌చేస్తూ వాళ్ళ సంభాష ణను మౌనంగా వింటున్నాడు రాజ గోపాలరావు. అతనికి త్వరగా యిల్లు చేరాలని వుంది. ఆ అడవి ప్రాంతం సురక్షితంగా దాటితే చాలు భగవంతుడా- అని అను కొంటున్నాడు.

అతను భయపడ్డట్టే అయింది. ఎవరో రోడ్డుకు అడ్డంగా నిలబడి కారును ఆపమంటున్నారు. ఆపటమా - మొండిగా వెళ్ళటమా! అని ఆలోచిస్తుండగా వో నాటు బాంబు పేలింది. కారు ఆగింది.

"ఆడవాళ్ళు వొకరికిద్దరున్నారు" అన్నాడెవడో బెక్‌సీట్‌లోకి తొంగి చూసి.

"దిగండంతా!"

ముగ్గురూ దిగేరు. లైట్ వారి మీదికి ఫోకస్ చెయ్యబడింది.

"ఎవరు మీరు? ఏమిటీ దౌర్జన్యం?" రాజగోపాలరావు విసు పోతూ అడిగేడు. 'డబ్బు దోచుకో

కుంకా ఆడవాళ్ళని అలా చూస్తారేం?'

"యీ యిద్దరు అందగత్తెల్లో వొకరిని మా వెంట పంపాలి."

"దేనికి?"

"అది మా బాస్ ఆజ్ఞ. అలా చేస్తే ఎవరికీ ఏ ప్రమాదం వుండదు."

మాధురి భయంతో అన్న చేతిని పట్టుకొంది. కానీ రాజగోపాల్ అరవింద చేతిని పట్టుకొన్నాడు ఆత్రంగా.

"త్వరగా నిర్ణయించుకోండి! ఎవరు వస్తున్నారు బాస్ దగ్గరకు!"

'భార్య! పెళ్ళి నిశ్చయమైన చెల్లెలు! ఎవర్ని పంపటం?'

రాజకీయపు ఎత్తుగడ వేసేడు. కాలహరణం కోసం వారితో చర్చలకు దిగబోయాడు.

"నో ఆర్గ్యుమెంట్స్ ప్లీజ్! నో డిలే. వెంటనే రావాలి!" ఆజ్ఞ.

"పెళ్ళి కానిదాన్ని నేను వెళ్తానన్నయ్యా!"

రాజగోపాల్ చెల్లెలి చెయ్యి వదిలేసేడు.

"వద్దమ్మా! అభం శుభం తెలియని అమాయకురాలివి. పైగా పెళ్ళి కావల్సినదానివి. నేను వెళ్ళొస్తాలే. ఏమౌతుంది?" అంది అరవింద.

వద్దన్నట్లు భార్య చెయ్యిగట్టిగా పట్టుకొని నొక్కేడు రాజగోపాల్.

"నో డిలేయింగ్ టాక్టిక్స్. మీలో మీరు తేల్చుకోలేక పోతే యిద్దరూ పదండి. మిగతా నిర్ణయాలు బాస్ చేస్తాడు. ఊ!"

ఆ తర్వాత ఎవరు మాట్లాడటానికీ అవకాశం యివ్వలేదు దొంగలు. యిద్దర్నీ వాళ్ళ వాహనం మీద ఎక్కించుకొని కొందరు వెళ్ళేరు. మరి కొందరు రాజగోపాల్ రావుకు కాపలాగా మిగిలిపోయారు.

* * *

ఆకాశంలో కార్తీక పౌర్ణమి చంద్రుడు! ఎదురుగా అంతకన్నా చల్లగా ప్రకాశిస్తూ వొకరికిద్దరు అపూర్వ సౌందర్యరాసులు! ఆ వాతావరణం, వారి అందం అతనిలో తామస ప్రవృత్తిని రెచ్చకొట్టటం లేదు. మనసంతా హార్ద్రపూరితమయింది. ఎన్నడూ పొందని ఏదో ప్రశాంతత- అనిర్వచనీయ అనుభూతి!

మాధురి తలవంచుకొని నిల్చింది. అరవింద వోరకంటితో రామ్‌చంద్‌ని- అతని ముఖ కవళికలను బట్టి స్టడీ చేస్తోంది. ఆమెకతను ముందు తను వూహించినంత రాక్షసుడిగా కన్పించలేదు. సౌందర్య

దృష్టి, అంతర్గత సంస్కారం వున్న వాడిలాగే కన్పిస్తున్నాడు.

"నేను కొత్తగా పెళ్ళిచేసుకొన్న యిల్లాలివి. యీమె నా మరదలు. పెళ్ళి నిశ్చయమయింది. అయినా మిమ్మల్ని చూస్తుంటే నో సోదరుని చూస్తున్నట్లుగా వుంది. అనవసరంగా భయపడ్డామేమో ననిపిస్తున్నది. అలా అనుకోటానికి కారణం ఏమిటో తెల్సా అన్నయ్యా! మీ సౌందర్యదృష్టి."

"సౌందర్యదృష్టి అంటే?"

"శరీరాన్ని క్షణిక సుఖాన్ని ఆశించి కామించటం, సౌందర్యాన్ని ఆరాధించి అనుభవించటం వేరువేరు విషయాలు. మొదటిది భౌతికం, రెండవది మానసికం. శారీరక వాంఛలు మనుష్యులతోపాటు కుక్కలకి, నక్కలకి, గాడిదలకి కూడా వుంటాయి. ఏదో విధంగా తీర్చుకొంటాయి. సౌందర్యాన్ని అనుభవించటం మనుష్యులకు మాత్రమే చాతనైన కళ. ఆ కళలో నువ్వు వందితుడివిలా కన్పిస్తున్నావు. కాకపోతే, కేవలం శారీరక వాంఛ తీర్చుకోటానికే అయితే మీకు స్త్రీలే దొరక్క మమ్మల్ని యీ విధంగా తెప్పించుకొంటారా? ఏ స్త్రీ అయినా యివ్వగల దానికోసం, సంసార స్త్రీల జీవితాల్ని నాశనం చెయ్యాల్సిన అవసరం లేదుగా అన్నయ్యా?"

"యింతకీ ఏమిటి నువ్వనేది?"

"నేననేదేముంది? క్షణకాలపు శారీరక సుఖం కోసం పిలిపించారో, లేక సౌందర్య ఆరాధనకు పిలిచారో మీరు తేల్చుకోవాలి."

"సౌందర్య ఆరాధనంటే స్త్రీని అనుభవించటం కాదా?"

"నా అభిప్రాయం చెప్పేముందుగా మీ దృష్టి అదేనని నాకు తెల్సు. కాకపోతే యింతసేపు మా మానం పిలిచేదా? మా డబ్బుని, నగల్నికాక, మీ అనుచరులు అందాన్ని పరిశీలిస్తున్నప్పుడే అనుకొన్నాను-మీరు అసాధారణ వ్యక్తులని."

రామ్‌చంద్ పొగడ్తకు పొంగిపోయాడో, అరవింద అభిప్రాయాలకు లొంగిపోయాడో తెలియదు.

"శారీరకంగా కాకుండా నా మనసును మీరు ఎలా సంతోష పెట్టగలరు?"

అరవింద కమ్మగా గానంచేసింది. మాధురి దానికి తెల్సిన పురాణకథలను మధ్య మధ్య పద్యాలు చదువుతూ చెప్పింది.

రామ్‌చంద్ పాటకు పరవశించాడు. మాధురి చెప్పిన మంచి మాటల్తో మనసు చల్లబడింది. పిచ్చి

కోరికలేమైనా వుంటే వాటిమీద మంచుపెళ్ళు చల్లినట్లయింది.

"వస్తా! నేను దొంగనీ కాదు, కాముకుడినీ కాదు. కాని పరిస్థితుల ప్రభావం వల్ల దొంగతనం వృత్తిగా స్వీకరించాల్సి వచ్చింది. స్త్రీ ద్వేషి నయి వుండీ యివ్వాళ వాతావరణ ప్రభావం వల్ల కాముకత్వానికి లొంగేను. కాని మీరు స్త్రీపట్ల ద్వేషాన్ని పోగొట్టి సౌందర్యదృష్టిని నేర్పేరు. సంతోషం" అంటూ వాళ్ళిద్దర్నీ స్వయంగా తీసుకొచ్చి కారు దగ్గర వదిలేడు.

* * *

కారు స్పీడ్‌గా పోతోంది. అంతకన్నా స్పీడ్‌గా రాజగోపాలరావు మనసులో పిశాచాలు తైతెక్కలాడుతూ డేన్స్ చేస్తున్నాయి.

'యిద్దర్లో ఎవరు? అరవింద—మాధురి? మాధురి అరవిందకన్న సౌందర్యవతి - పైగా పెళ్ళికానిది! ఏమో! వాడి కళ్ళకి అరవిందే అందగత్తెగా కన్పించకూడదూ? అసలు ....అసలు....యిద్దర్నీ....? ఎవరూ మాట్లాడరేం? సిగ్గా? భయమా?'

రాజగోపాలరావు శరీరంలో నరాలు పొంగుతున్నాయి. రక్త ప్రసార వేగం ఎక్కువయింది.

---

కథా నిలయం

## విశాఖ
## చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ. |
| అర్ధసంవత్సర చందా | 18 రూ. |
| విడి ప్రతి | 3 రూ. |

"యూ- యూ_ బిచ్! ఎవరూ- ఎవరూ మాట్లాడరేం? యిద్దర్లో ఎవరు?" యింట్లోకి ప్రవేశించగానే పెద్దగా అరిచాడు. గోలచేసేడు. అరవింద లైట్లు పుల్‌గా వేసింది.

"వదినా! నాకు ఆకలేస్తోంది. ముందు అన్నం తిందాంపద"

కల్లు తాగి నిప్పు తొక్కిన కోతి లాగయ్యాడు రాజగోపాలరావు.

"ఎంత వగలాడులే మీరిద్దరూ! అంతపని జరిగితే ఏమీ జరగనట్లు ఎంత హాయిగా..సహజంగా-ఛీ!"

కుర్చీలు విసిరేసేడు, డైనింగ్ టేబిల్‌పై పళ్ళాలు పగలగొట్టేడు.

"చూడండి భర్తగారూ! ఆ ప్రశ్న మమ్మల్ని అడగటానికి సిగ్గు వేయటం లేదూ మీకు? సౌందర్య దృష్టిగలవారని పెద్దపేరే! ఏం? నిత్యం మీరు చూచే యీ రెండు బొమ్మల్లో ఏ బొమ్మకు మలినం అంటుకొందో, ఏ బొమ్మ విరిగి పోయిందో చూచి పోల్చుకో లేరూ? మా అన్న శ్రీరాముడంతటి గొప్పవాడంటుంది మీ చెల్లెలు. అందుకే అలనాడు సీత పెట్టి సాహ పించలేని పరీక్షను మీకు పెడు న్నాను. మీ భార్య, చెల్లెలు-యిద్దరిలో ఎవరు చెరచబడ్డా -చెడిపోయాం- అపవిత్రులమయ్యాం? చెప్పి మీ సౌందర్య దృష్టిని నిరూపించు కోండి!"

రాజగోపాలరావుకు కోపం పెరుగుతోంది. కానీ నోటమాట రావటంలేదు. చూస్తున్నాడు- యిద్దర్నీ విడివిడిగా, కలిపి చూస్తున్నాడు.

"రూపాయలపట్ల నీకు గల వెర్రివ్యామోహం, నీ సౌందర్య దృష్టిని, సహృదయతను చంపేసిం దన్నయ్యా! మానవత్వాన్ని తినే సింది నీబుద్ధికి, మనస్సుకి అంటు కొన్న మలినాన్ని ముందు కడిగి పారేసుకో!"

"యిలాంటి రాముళ్ళ కన్నా రామ్‌చంద్ లాంటి రావణాసురులే వొకవిధంగా మేలంటాను యిప్పుడు మీ అన్నను గురించి నువ్వేమం టావు మాధురీ!"

"నా భర్తను నేనే ఎన్నుకొం టాను వదినా! సమస్త లోకాన్ని రూపాయపైనల లాభదృష్టితో కాకుండా, సౌహార్ద్ర పూరిత దృష్టితో చూచే వ్యక్తిని చేసు కొంటాను."

రాజగోపాలరావు శిలాప్రతిమలా నిలబడి ఆలోచిస్తున్నాడు. ఏమిటి ఆలోచిస్తున్నాడో! మానసిక సౌందర్య సాక్షాత్కారం ఏనాడు కలిగెనో? ★